# మా వాడి పరిణామం

నేను హోటలునుంచి బయటపడేసరికి నన్ను బిచ్చగాళ్లు చుట్టుముట్టారు. వాళ్ళను వదిలించుకొని ఇవతల పడేసరికి నా తల ప్రాణము తోకకువచ్చింది. ఇంతలో నన్ను వెనుకనుంచి ఎవరో పిలిచినట్లయింది. వెనుదిరిగి చూడగా శర్మ! చాలా ఆశ్చర్య పడాను వాణ్ణిచూసి. ఇంతలో శర్మ నా దగ్గరకు వచ్చేశాడు. చాలా రోజుల తర్వాత ఒకర్నొకరు కలుసుకున్నందుకు ఇద్దరమూ సంతోషించాము.

మేము ఇద్దరం చిన్ననాటి స్నేహితులము. ఇద్దరం కాలేజి విద్య పూర్తిచేసుకొని బయటపడింది గూడా ఒకేసారి. కొన్నాళ్ళకు నాకు ఉద్యోగము వచ్చినందువల్ల నేను వేరొక ఊరికి వెళ్ళిపోయాను. ఆ తరువాత వాణ్ణి ఇక్కడ (నేను ఉద్యోగం చేసే ఊరిలో) కలుసుకోడం ఇదే ప్రథమం.

వాడిదొక విచిత్ర మనస్తత్వం. అల్పకోపి. వాడు ఎట్లాఉన్నా ఇద్దరం కలిసిమెలిసి ఉండేవాళ్లం. వాడు తొందరగా ఒకరిని దూషించి, తెలుసుకొని తిరిగి భూషిస్తాడు. అప్పుడప్పుడు తను అందగాడినని గర్వపడుతుంటాడు. ఎప్పుడైనా తమాషాకు "ఏరా! నలకూబరా! నీ వ్యవహారం ఇప్పుడు ఎట్లాఉంది" అంటే వాడు ఖుస్సుమంటాడు. కాలర్ సర్దుకొని హీరో ఎన్. టి. ఆర్. లా పోజుపెట్టి (అప్పుడప్పుడు ఇలాంటి పోజుల కొరకు గంటలతరబడి అద్దంముందు కూర్చోడము గూడా కద్దు) నలుదిక్కులా పరికించి "పోరా! నీకన్నా ఫర్వాలేదులే. నన్ను లెక్క చేయని అమ్మాయి లేదురా! మనమంటే ఏమనుకొన్నావు. నీమొహం ఎవరు చూస్తార్రా నల్లగా," అని అంటూంటాడు.

ఆమాటా ఈ మాటా మాట్లాడుతూ నేను వాణ్ణి "ఎక్కడపడితే అక్కడ కృష్ణుడిలాగా సాక్షాత్కరిస్తావు. ఏమిట్రా ఇక్కడకి రావడంలోని మర్మం" అన్నాను నవ్వుతూ. వాడు నవ్వుతూ "మన కది అలవాటేగా. నీకు తెలీదుట్రా. మాది కృష్ణాంశము," అని "నాకు ఇక్కడ కొద్దిగా పని ఉందిర్రా," అని అన్నాడు.

తర్వాత రెండురోజులు నా రూములో ఉండి పని చూసుకొని వెళ్ళిపోయాడు. పోతూ తనవూరికి రమ్మని మరీమరీ చెప్పి వెళ్లిపోయాడు.

అటు తర్వాత నెలకు నేను ఉద్యోగరీత్యా వాడుండే ఊరికి పోవడం తటస్థించింది. పెట్టి బేడా సర్దుకుంటూ ఆ ఊరిలో ఎక్కడ బస చేయడమా అని ఆలోచించుకుంటూ ఉండగా వాడు జ్ఞాపకం వచ్చాడు. వాణ్ణి మరల కలుసుకునేందుకు అవకాశం దొరికిందని చాలా సంతోషించాను. నేను వాడికి ఉత్తరమైనా రాయకుండా బయలుదేరాను.

వాడి ఇంటికి పోగానే వాడు వరండాలో కూర్చొని ఎవరో అమ్మాయికి ప్రయివేటు చెప్తున్నాడు. ఆ అమ్మాయినిచూచి ఆశ్చర్యపడాను. నాకు తెలిసినంతవరకూ వాడియింట్లో ఎవరూ పదిహేడేళ్ళ అమ్మాయి లేదు. నన్ను చూడగానే ఆ అమ్మాయి లేచివెళ్లింది. వాడు తలెత్తి నన్ను చూచి నిర్ఘాంతపోయాడు. "ఉరుములేకుండా పిడుగుపడ్డట్టు ఉత్తరముక్కయినా లేకుండా ఊడిపడావేమిట్రా, జాబురాయాలనీ తెలీదూ" అని అన్నాడు. నేను నవ్వి "తీరిక దొరకలేదురా" అని అన్నాను. కుశల ప్రశ్నలయాక నన్ను యింట్లో అందరికీ పరిచయం చేశాడు. ఇంట్లోఅందరూ నన్ను బాగా గౌరవించారు.

సాయంకాలం వాడూ, నేను సినిమా ప్రోగ్రాం వేసుకున్నాం. సినిమా థియేటరుకు పోతూ, దారిలోవున్న హోటలులో జొరబడాం. తీరిగ్గా కూచొని తింటూ ఆమాటా ఈమాటా మాట్లాడుతూ నేను వాణ్ణి "ఆ అమ్మాయి, అదే నీవు ప్రయివేటు చెప్పే అమ్మాయి, ఎవర్రా" అని కదిలించేను. వాడు "ఆ అమ్మాయా!" అంటూ "మా పక్కింటి వాళ్ళరా, మాకుకొంచెం దూరపు బంధువులు. మేమూ, వాళ్ళు కలిసిమెలిసి ఉంటున్నాం. ఆ అమ్మాయి ఎస్సెల్సీ చదువుతున్నది. ఏదన్నా తెలీకపోతే చెప్పించుకునేందుకు నా దగ్గరికి వస్తుంది" అని అన్నాడు.

ఆ అమ్మాయి కొంచెము నల్లగా ఉంటుంది. పిరుదులవరకు వేళ్లాడే నాగుపాములాంటి జడ. కొంచెము సన్నగావుండి, అప్సరస కాకపోయినా ఆకర్షణీయంగా ఉంటుంది.

కాఫీ చప్పరిస్తూ స్నేహధోరణిలో తమాషాగా "ఏంరా! ఆ అమ్మాయికి ఏమైనా

ఆమంచర్ల కృపానిధి

పేటు వేస్తున్నావా? కొంపదీసి ప్రేమిస్తున్నావా? పెళ్ళిచేసుకోడానికేనా ఈ భగీరథయత్నం? ముహూర్తం ఎప్పుడు?" అని ప్రశ్నలవర్షం కురిపించాను. వెంటనే వాడు ఖుస్సుమన్నాడు. "చెప్పమంటే చెప్తాను గాని, ఆ అమ్మాయినట్లా చేసుకోనేరా. ఆ అమ్మాయి నాకు శిష్యురాలు. అటువంటి పిచ్చిఅభిప్రాయం నాకు లేదు. అసలు నేను సామాన్యంగా, ఎక్కువగా, ఆమెతో మాట్లాడను. ఎప్పుడో రెండు, మూడుసార్లు ప్రయివేటు చెప్పమంటే చెప్పానేగాని వేరే ఉద్దేశ్యంతో గాదురా! చేసుకోక, చేసుకోక ఆ అమ్మాయినట్లా చేసుకోనేదీ నల్లగాఅదీ, ఏం ఖర్మనాలిటే ఉందని" అని వాడు నన్ను మెత్తగా చీవాట్లు వేశాడు. నేను విచారపడాను వాడిమనస్సు నొప్పించినందుకు. "అదిగాదురా! ఈమధ్య నేను రెండు, మూడు పెళ్ళిసంబంధాలు వస్తున్నాయని కర్ణాకర్ణి వినబట్టి అడిగానేగాని ఇంకేం లేదురా. క్షమించు" అన్నాను నేను. "ఏం ఫర్వాలే"దంటూ నవ్వి భుజంమీద చెయ్యివేసి, హోటలులోనుంచి బయటికి తీసుకొచ్చాడు నన్ను. తర్వాత ఇద్దరం థియేటరువైపుదారితీశాం.

మరుసటిరోజు సాయంత్రం వాడొక సీసాపట్టుకొని, నన్నుకూడా రమ్మన్నాడు బయటికి. "ఎక్కడికిరా" అన్నాను. వాడు "హాస్పిటలుకు మందుకురా" అన్నాడు. "ఎవరికిరామందు" అన్నాను ఆశ్చర్యపోతూ. (వాళ్లింట్లో అందరూ బాగుగా ఆరోగ్యంగా ఉండేవాళ్ళు.) వాడు మాట్లాడకుండా చెయ్యిపట్టుకొని బయటికి తీసుకపోతూ దారిలో "నాక్కాదురా, పక్కింటి అమ్మాయికి జ్వరంగా ఉందట. వాళ్లింట్లో ఎవరూ మొగపురుగు లేనందున ఈపని నాకు పురమాయించారు" అన్నాడు.

తర్వాత వరుసగా వాడు మూడురోజులు మందు శ్రద్ధగా తెచ్చేవాడు. నాపని ఈమూడు రోజులలో పూర్తయినందువల్ల నేను ఇంతలోనే మాఊరికి వెళ్ళవలసివచ్చింది. నేను మామూలుగా నే పనిలో జేయినయినాను.

ఒకనాడు నేను ఆఫీసుఫైళ్ళతో ఫైట్ చేస్తుండగా నా భుజముమీద ఒక చెయ్యి పడింది. హఠాత్తుగా తలెత్తి వెనక్కు తిరిగి చూడగా నవ్వుతూ, శర్మ మేనమామ హనుమంతరావుగారు కన్పించారు. నేను ఆశ్చర్యపోయి "ఏంపనిమీద వచ్చారు" అని అన్నాను కుర్చీ చూపుతూ, ఆయన

కుచ్చిలో కూర్చొంటూ "మా అమ్మాయి సంబంధంకోసమే ఇంతదూరము రావలసి వచ్చింది" అన్నాడు నుదుటిమీద చెమటను పై పంచతో తుడుచుకొంటూ. "మా వూరికి తిరిగిపోతూ మీరు ఆఫీసులో పనిచేస్తున్నారని తెలిసి మిమ్మల్ని చూచిపోదామని వచ్చాను." అని అన్నాడు కళ్ళద్దాలు సవరించుకొంటూ. నేను ఫైల్సుమూసి "ఇప్పుడే అలా వెళ్దాంరండి" అంటూ దగ్గరిలో వున్న హోటలు వైపు దారితీశాను. దారిలో పోతూ "అయితే మీరు ఇన్నిరోజులుగా మీ అమ్మాయిని శర్మకు అని అనుకొంటున్నారు. ఆ సంబంధం కుదరలేదా?" అని ప్రశ్నించాను ఇంతలో హోటలు సమీపించాము. "రండి లోపల స్తిమితంగా మాటాడుకోవచ్చునని. ఆయనలోపల అడుగుపెట్టాడు. ఇద్దరమూ లోపల స్థిమితంగా కూర్చొన్న తిరువాతి ఆయన ఇలా మొదలుపెట్టాడు.

"నిజమే నాయినా శర్మమీద ఇన్నాళ్ళు ఆశలు పెంచుకొనివున్నాను. అయిన సంబంధం గదా అని, కాని మా ఆశలన్నీ నేల మట్టం చేశాడు మీవాడు. ఆశ్చర్యంతో ఏం చేశాడండీ మావాడు అని అన్నాను నేను. "మీ వాడే! వాడు ఆ పక్కింటమ్మాయితో లేచిపోయాడండీ, పోయి కూడా పదిహేను రోజులైంది, మీకు తెలీదూ. అయినా వాడు ఇట్లా చేస్తాడని ఎవ్వరమూ అనుకోలేదు" అని ముగించాడు కాఫీగ్లాసు బల్లమీద పెట్టూ. తర్వాత ఆయనా, నేను బయటికి వచ్చి కొంసేపు ఆమాటా ఈమాటా మాట్లాడిన వెనుక ఆయన నాదగ్గర సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు బస్సుకు టైం అయిందంటూ.

ఆయన శర్మనుగురించి చెప్పిన సంగతికి నాకు మూర్ఛపోయినంత పని అయింది. ఆశ్చర్యపడ్డాను ఇన్నాళ్ళు నెగవ, ఆ ముసలి మేనమామకు లేనిపోని ఆశలు కల్పించి తుదకు ఇట్లా చేస్తాడా? అదిగాక ఆపక్కింటమ్మాయి బాగాలేదంటూ ఖచ్చితంగా పెళ్ళిచేసుకోనంటూ ప్రగల్భాలు పలికి నన్ను తిట్టి, ఆమెతోనే లేచిపోయాడే చివరికి. ఎంత పని చేశావురా", అని ముక్కుమీద వేలు వేసుకొన్నాను.

తర్వాత రెండు నెలలకు శర్మ దగ్గరనుంచి (వాళ్ళవూరినుంచే) నాకు ఒక శుభలేక, శర్మకు, ప్రక్కింటమ్మాయికి వివాహము జరుగుతున్నట్లు ఒక పెద్ద జాబు వచ్చినాయి. వాడికి రావలసిన ఉద్యోగం వాళ్ళవూరిలోనే వచ్చినట్లూ, పెద్దలందరి ఇష్టానుసారముగానే వారిద్దరు (ఆ పక్కింటమ్మాయి వాడు) వివాహం చేసుకుంటున్నట్లూ, నన్ను వివాహానికి తప్పక మరీమరీ రమ్మనీ, లేకుంటే నా మొహం ఇకమీదనుంచీ చూడననీ ఇంకా తననుగురించి ఏవేవో ఇతర సంగతులు వ్రాశాడు, జాబంతా చదివిన తిరువాతి నుదుటిమీద చెమటను తుడుచుకున్నాను.



"మావాణ్ణి కొంచెం మీరు జాగ్రత్తగా కనిపెట్టండమ్మా!"

వాడి పెళ్ళికి వెళ్ళాను. పెళ్ళి చాలా వైభవంగా జరిగింది. పెళ్ళితంతు అంతా ముగిసిన తిరువాత ఇద్దరమూ ఏకాంతంగా పిచ్చాపాటీ మాట్లాడుకోడానికి వీలు దొరికింది. అప్పుడు నేను వాణ్ణినిలదీసి "ఏంరా! ఆ ముసలాయనకు—మీ మేనమామకు, లేనిపోని ఆశలు కల్పించి నట్టేట ముంచుతావా? పక్కింటమ్మాయి బాగాలేదనీ, నీ శిష్యురాలనీ, ఖచ్చితంగా పెళ్ళి చేసుకోననీ, పైగా తమాషాగా నేనంటే నన్ను దుమ్మెత్తిపోసి చివరకు నీవుచేసిన ఘనకార్యమిదేరా" అని అడిగాను, వాడునవ్వి "ముసలాయన్ను అసలు ఆశలు పెంచుకోమని ఎవర్రా చెప్పింది? నేను ఎప్పుడు ఆయన కూతుర్ని చేసుకుంటానని మాట ఇవ్వలేదు. పైగా ఆయనే నన్ను వేధించుక తినేవాడు. ఇక పోతే అసలు కథ ఏమిటంటే నాకు ఆపక్కింటమ్మాయిమీద నీవు వచ్చి నన్ను చూచిపోయినంతవరకూ, ఎలాంటి అభిప్రాయం లేదు. నీకు తెలుసుకద్రా, వాళ్ళింట్లో ఎవ్వరూ మొగపురుగులేరని జ్వరం వచ్చిన తర్వాత ఆమెకు తప్పని సరిగా సేవచేసే భారం నామీదే పడింది. చెప్పొద్దూ, అప్పుడే మాయిద్దరి మనసులూ ఏకమయినాయి. ఇద్దరమూ ఒకటయినాము. అదే ఇంతవరకూ దారితీసింది. అయినా గాని నీవు చెప్పరా. మనిషికి అందమా ప్రధానం, అది అశాశ్వతం. మనసులు బాగుండాలే కాని మిగతా వన్నీ లెక్కలోకి వస్తాయా?" అని వాడు నాకు గీత బోధించాడు అపర గీతాచార్యుడిలాగా. ఇంక నేను ఏమీ బదులుచెప్పలేక చిత్తం అని తలవంచాను అర్జునుడి లాగా.

తర్వాత వాడు గదిలోకి వెళ్ళి వాడి ప్రేమాయణం తాలూకు నడిచినవ్యవహారం, తతంగం అంతా నాకు చూపించి నవ్వాడు. అవి ఒక కట్ట ప్రేమ లేఖలు, ఒక డైరీ, ఒక ఫోటో స్టాండు (ఎదురు ఎదురుగా వాళ్ళిద్దరి ఫోటోలు) ఇంకా ఏమో ఉన్నాయి.

అప్పుడు నేను వాణ్ణిచూచి "నీలీల లన్నీ చాలించవోయీ" అని నవ్వుతూ రాగం ఆలాపించాను. వాడు నన్ను చూచి నవ్వాడు నేనూ నవ్వాను. ఇంతలో మావాడి శ్రీమతి ట్రేలో కాఫీ గ్లాసులు పట్టుకొని వచ్చి మమ్మల్ని చూస్తూ నవ్వుకొంది. నా భుజం మీద చేయివేస్తూ నన్ను ఆమెకు పరిచయం చేశాడు. నేను "మావాణ్ణి కొంచెం మీరు జాగ్రత్తగా కనిపెట్టండమ్మా. లేకుంటే మాయమవుతుంటాడు శ్రీకృష్ణుడిలాగా," అన్నాను. ఆమె సన్నగా నవ్వుతూ "ఆభయమక్కరలేదు లెండి. మీ ఫ్రెండుగారిని నాకొంగుకు ముడివేసుకుంటాను" అన్నది. "అబ్బా" అన్నాడు మావాడు. అందరమూ సరదాగా నవ్వాము. ★